

భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆకుతోటబావితండా రైతులు



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఒడ్డుగూడ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

# కాళ్లు మొక్కుతాం.. ధాన్యం కొనండి సారూ!

- భువనగిరి కలెక్టరేట్ వద్ద తడిసిన ధాన్యంతో గిరిజన రైతుల బైఠాయింపు
- కానిస్టేబుల్ కాళ్లపై పడి వేడుకున్న మహిళా రైతు
- కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు

భువనగిరి కలెక్టరేట్, మే 14 : సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు వడ్లు తడిసిపోతున్నాయని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోటబావితండా గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం వారు తడిసిన ధాన్యం బస్తాలతో వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయడంలో, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అకాల వర్షాలతో ధాన్యం పూర్తిగా తడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ధర్నా చేస్తున్న రైతుల వద్దకు పోలీసులు రాగానే.. రైతులు వారి కాళ్లు మొక్కుతూ.. తమ బాధలు తీర్చాలని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు రైతుల వద్దకు వచ్చి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు, కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నిరసనలో రైతులు సుధాకర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఉమ్లానాయక్, రవీందర్, దేవేందర్, సాగర్‌నాయక్, లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో పచ్చి మోసం!

- ఒడ్డుగూడలో ధర్నాకు దిగిన రైతులు
- తూకంలో వ్యత్యాసంపై మండిపాటు
- క్వింటాల్‌కు ఐదారు కిలోలు తేడాపై ఫైర్
- నిర్వాహకుడి తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

దహెగాం, మే 14 : ధాన్యం తూకంలో మోసం చేస్తున్నారంటూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఒడ్డుగూడ గ్రామానికి చెందిన రైతు సత్తన్న సోమవారం రాత్రి 500 బస్తాల ధాన్యం కాంటా వేయగా.. అంచనా వేసిన దిగుబడికి.. కేంద్రంలో వచ్చిన తూకానికి తేడా ఉండటంతో మంగళవారం ఉదయం కొనుగోలు కేంద్రానికి వెళ్లి తాను విక్రయించిన ధాన్యం బస్తాల్లోనుంచి ఒక బస్తాను తీసుకొళ్లి ప్రైవేట్ కాంటాపై తూకం వేయించారు. అధికారులు ఏర్పాటు చేసిన కేంద్రంలో 40 కిలోల 500 గ్రాములుగా ఉన్న ధాన్యం బస్తా.. అదే ప్రైవేట్ కాంటాపై 43 కిలోలు చూపించింది. ఇలా నాలుగైదు బస్తాలను తూకం వేసి చూశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు ఐదారు కిలోల ధాన్యం తక్కువగా చూపిస్తున్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని తోటి రైతులకు చెప్పడంతో వారంతా కలిసి కొనుగోలు కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడి నారాయణ వల్లే తాము మోసపోయామంటూ రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇతను పనిచేసిన గిరివెల్లి కొనుగోలు కేంద్రంలోనూ ఇలాంటి మోసాలకే పాల్పడినట్టు రైతులు ఆరోపించారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 220 క్వింటాళ్ల ధాన్యం కొని మిల్లర్లకు పంపించారని, అందులో కూడా మోసం జరిగి ఉంటుందని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నిర్వాహకుడు తుమ్మిడ నారాయణపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## వానకాలం సాగు 1.34 కోట్ల ఎకరాలు

- యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- 66 లక్షల ఎకరాల్లో వరి, 60 లక్షల ఎకరాల్లో పత్తి
- 24 లక్షల టన్నుల ఎరువుల సరఫరాకు ప్రణాళిక

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): వానకాలం సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ సీజన్‌లో 1.34కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా వరి 66 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఆ తర్వాత పత్తి 60 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 6 లక్షల ఎకరాల్లో, కంది 5.65 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ 5 లక్షల ఎకరాల్లో, మిగిలిన పంటల్లో పెసర 56వేల ఎకరాల్లో, జొన్న 38వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసింది. గత వానకాలంలో 1.24కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగైనట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గతేడాది సాగుతో పోల్చితే ఈ ఏడాది వానకాలంలో మరో 8 లక్షల ఎకరాల్లో అదనంగా పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నది. గత వానకాలంలో రికార్డు స్థాయిలో 65 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా పత్తి 44.77 లక్షల ఎకరాల్లో సాగైంది.

### ఎరువులు, విత్తనాలపై దృష్టి



పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సమకూర్చడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మొత్తం పంటలకు సుమారు 19 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నది. ఇందులో వరి విత్తనాలు 16.5 లక్షల క్వింటాళ్లు, పత్తి 54వేల క్వింటాళ్లు అవసరం కానున్నాయి. మొత్తం 24.40 లక్షల టన్నుల ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే కేంద్రంతో సంప్రదించి ఎరువుల కోటాను మంజూరు చేయించింది. మొత్తం ఎరువుల్లో అత్యధికంగా 10.40 లక్షల టన్నుల యూరియా, 10 లక్షల టన్నుల ఎన్‌పీకే, 2.40 లక్షల టన్నుల డీఏపీని సిద్ధం చేసింది. ఏ నెలలో ఏ ఎరువులను ఎంత మొత్తం పంపిణీ చేయాలో ప్రణాళిక రూపొందించింది. మే, జూన్ నెలల్లో అత్యధికంగా 4.60 లక్షల టన్నుల చొప్పున ఎరువులను పంపిణీ చేయనుంది. ప్రస్తుతం డీలర్లు, సొసైటీలు, మార్క్‌ఫెడ్‌తో పాటు గోదాముల్లో 11 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకుగానూ మార్క్‌ఫెడ్ వద్ద 5 లక్షల టన్నుల యూరియాను బఫర్ స్టాక్ పెట్టాలని నిర్ణయించింది.

## ఉమ్మడి ఖమ్మంలో వర్షబీభత్సం

- ఈదురు గాలులకు ఎగిరిపడ్డ ఇండ్ల పైకప్పు రేకులు
- ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై కూలిన చెట్లు
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నల్లగొండలో పిడుగుపడి యువకుడి మృతి

తిరుమలాయపాలెం/టేకులపల్లి/కూసుమంచి/త్రిపురారం, మే 14 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతోపాటు ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. గాలిదుమారంతో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాయిగూడెం స్టేజీ సమీపంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై భారీ వృక్షాలు కూలిపోయాయి. గంటలతరబడి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. జేసీబీ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు, పోలీసులు గొడ్డళ్లతో చెట్ల కొమ్మలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. టేకులపల్లి మండలం బోడు, మొక్కంపాడుతండా, రామచంద్రునిపేట, కొప్పురాయి, బర్లగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో సాయంత్రం తీవ్రమైన గాలులు, ఉరుములతో వర్షం కురిసింది. మొక్కంపాడుతండాలో బానోత్ రవి ఇంటి ఆవరణలో ఉన్న వేప చెట్టు విరిగి ప్రహరీపై పడింది. అదే తండాకు చెందిన బానోత్ నరేశ్‌కు చెందిన ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.



ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై గోపాయిగూడెం స్టేజీ వద్ద కూలిన చెట్లు

### క్రికెట్ ఆడుతున్న యువకులపై పిడుగు



రుషి (ఫైల్)

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయగూడెంలో మంగళవారం సాయంత్రం కొందరు యువకులు క్రికెట్ ఆడుతుండగా ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. వారంతా సమీపంలోని తాటి చెట్ల వద్దకు వెళ్లి నిలబడ్డారు. అదే సమయంలో తాటి చెట్టుపై పిడుగుపడటంతో మర్రి రుషి (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన మర్రి రుషి (20) హైదరాబాద్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో నీలాయగూడెంలోని మేనమామ ఇంటికి నాలుగు రోజుల క్రితం వచ్చాడు.

## నాలుగు రోజుల్లో నైరుతీ రాక

- సమయానికి ముందే రుతుపవనాలు
- భారత వాతావరణ శాఖ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): దేశంలోని రైతాంగానికి భారత వాతావరణ విభాగం(ఐఎండీ)తీపి కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సమయానికి ముందే దేశంలోకి ప్రవేశిస్తాయని అంచనా వేసింది. సాధారణంగా మే 22నాటికి దక్షిణ అండమాన్ సముద్రంలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి క్రమంగా వారం, పది రోజుల్లో బంగాళాఖాతం నుంచి అరేబియా సముద్రంలోకి ప్రవేశించి కేరళ తీరాన్ని తాకుతాయి. కానీ, ఈసారి మూడు రోజులు ముందే మే 19 నాటికి చేరుకుంటాయని ఐఎండీ తెలిపింది. జూన్ 1 నాటికి నైరుతి రుతుపవనాలు కేరళకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇది సానుకూల పరిణామమని నిపుణులు చెబుతున్నారు. అయితే రుతుపవనాలు సకాలంలో దేశాన్ని తాకాలంటే అరేబియా సముద్రంలో వాతావరణం అనుకూలించాలి. అరేబియా సముద్రంలో అల్పపీడనం లేదా వాయుగుండం ఏర్పడితే నైరుతి రుతుపవనాల రాకలో జాప్యం తప్పదు. గత ఏడాది కూడా నైరుతి రుతుపవనాలు మే 19నే దక్షిణ అండమాన్‌లోకి ప్రవేశించాయి. కానీ అరేబియా సముద్రంలో తుఫాను,ప్రతికూల పరిస్థితుల వల్ల జూన్ 8న కేరళలోకి ప్రవేశించాయి. ఈ ఏడాది దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిపిస్తాయని ఏప్రిల్ 15నాటి ముందస్తు అంచనాల్లో ఐఎండీ తెలిపింది.

## వచ్చే వారంపాటు వానలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ నాగరత్న వెల్లడి



హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): వచ్చే వారంపాటు రాష్ట్రవ్యాప్తంగా తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరత్న తెలిపారు. మంగళవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసినట్టు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సాయంత్రం, రాత్రి సమయాల్లో జల్లులు పడే అవకాశం ఉన్నదని వెల్లడించారు. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో.. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో.. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో.. శనివారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.



వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్‌లో తాగు నీటి కోసం రోడ్డుపై బైఠాయించిన మహిళలు

## తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

దోమ, మే 14 : తాగు నీటికోసం వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్ వాసులు రోడ్డెక్కారు. స్థానిక గాలి పోచమ్మ కాలనీకి వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో గుక్కెడు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మోత్కూర్ నుంచి అయినాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో మహిళలు బైఠాయించారు. నీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన కరువైందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి తాగు నీటి సమస్యను తీర్చాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రాష్ట్రంలో 65.67% పోలింగ్

**2019 కంటే 2.90% అధికం ● గ్రామీణ ప్రాంతాల్లో భారీగా నమోదు**

- జీహెచ్‌ఎంసీ పరిధిలో పెరిగిన ఓటింగ్
- భువనగిరిలో అత్యధికంగా 76.68%
- హైదరాబాద్‌లో అత్యల్పంగా 48.48%

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 65.67 శాతంగా నమోదైంది. మొత్తం 3,32,32,318 మంది ఓటర్లకు 2,20,24,806 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో 62.77శాతం నమోదుకాగా ఈసారి 2.90 శాతం ఓటింగ్ పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం గతం కంటే అధికంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల వారు స్వస్థలాలకు వెళ్లినా ఇక్కడివారు ఓటేసేందుకు ఉత్సాహంగా ముందుకు రావడంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో గతం కంటే ఎక్కువగానే ఓటింగ్ జరిగింది. లోక్‌సభ నియోజకవర్గాలవారీగా చూస్తే 76.68 శాతంతో భువనగిరి మొదటి, 76.09 శాతంతో ఖమ్మం రెండో స్థానంలో నిలిచాయి. ఇక అతి తక్కువగా హైదరాబాద్‌లో 48.48 శాతం మాత్రమే నమోదైంది. ఓట్ల పరంగా రాష్ట్రంలోనే అత్యధికంగా మల్కాజ్‌గిరిలో 19.19 లక్షల ఓట్లు, చేవెళ్లలో 16.57 లక్షల ఓట్లు పోలయ్యాయి. అతి తక్కువగా సికింద్రాబాద్‌లో 10.39 లక్షల ఓట్లే పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,18,14,035 మంది ఓటర్లు ఈవీఎంల ద్వారా, 1,89,091 మంది ఉద్యోగులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 21,680 మంది హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మెదక్ లోక్‌సభ పరిధిలోని నర్సాపూర్‌లో అత్యధికంగా 84.25 శాతం, హైదరాబాద్ పరిధిలోని మలక్‌పేటలో అత్యల్పంగా 42.76 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓటర్ల పరంగా మేడ్చల్ నియోజకవర్గంలో అత్యధికంగా 3,85,149 మంది, భద్రాచలంలో అత్యల్పంగా 1,05,383 మంది ఓటేశారు.

### పెరిగిన ఓటింగ్.. బీఆర్‌ఎస్‌కు అనుకూలమనే చర్చ..

2019 ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలు ఉండే నాగర్‌కర్నూలు, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, జహీరాబాద్ లాంటి నియోజకవర్గాల్లో పోలింగ్ భారీగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు ఉదయం నుంచే ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. క్యూలో గంటల తరబడి బారులు తీరి ఓటేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగడం బీఆర్‌ఎస్‌కు అనుకూలమనే సంకేతాలు ఇస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా మభ్యపెట్టడం, కరెంటు కోతలు పెరిగిపోవటం, సాగునీరందక పంటలు ఎండిపోవటం, సమయానికి పెట్టుబడి సాయం అందకపోవటం, రూ.2లక్షల రుణమాఫీ కాకపోవటం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తాగు నీటి కటకట, విద్యుత్ బిల్లులు కొందరికే మాఫీ అవటం, 500 గ్యాస్ పథకం అమలు కాకపోవటం తదితర కారణాలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలు, బీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపినట్లు విశ్లేషిస్తున్నారు. కేసీఆర్ బస్సు యాత్ర సందర్భంగా రైతులు, మహిళలు, యువత నుంచి విశేష స్పందన వచ్చిందని, నమ్మి కాంగ్రెస్‌కు అధికారమిస్తే జరిగిన నష్టం వారికి తెలిసి వచ్చిందని, అందుకే ఈ సారి బీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపారనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్ సైలెంట్‌గా జరిగిందని, నిశ్శబ్ద విప్లవం రాబోతున్నదని చెబుతున్నారు.



### 'గులాబీ'కే పట్టణవాసుల పట్టం

ఈ సారి గ్రేటర్ హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ ఓటింగ్ శాతం పెరిగింది. ఇక్కడ స్థిరపడ్డ లక్షలాది మంది తమ రాష్ట్రాలకు ఓటేసేందుకు తరలివెళ్లారు. ఈ క్రమంలో ఓటింగ్ శాతం తగ్గుతుందేమోనని అంతా ఆందోళన చెందినా అందుకు విరుద్ధంగా పోలింగ్ శాతం పెరిగింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగానే పోలింగ్ శాతం పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోరనే అపవాదును తొలగించుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. వాతావరణం అనుకూలించడంతో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్, ఐటీ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని, బీఆర్‌ఎస్‌తోనే హైదరాబాద్ భవిష్యత్తు అన్న ఉద్దేశంతోనే ఆ పార్టీవైపు మొగ్గు చూపారని విశ్లేషిస్తున్నారు.

**గత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం**

| సంవత్సరం | పోలింగ్ శాతం |
|---|---|
| 2004- | 69.95 |
| 2009- | 72.70 |
| 2014- | 68.77 |
| 2019- | 62.72 |
| 2024- | 65.67 |

**జీహెచ్‌ఎంసీ పరిధిలో...**

| నియోజకవర్గం | 2014 | 2019 | 2024 |
|---|---|---|---|
| హైదరాబాద్ | 53.01 | 44.84 | 46.08 |
| సికింద్రాబాద్ | 52.66 | 46.50 | 49.04 |
| మల్కాజ్‌గిరి | 50.63 | 49.63 | 50.78 |
| చేవెళ్ల | 59.75 | 53.25 | 55.45 |

**లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య**

| లోక్‌సభ | 2024 | | 2019 | | 2014 | |
|---|---|---|---|---|---|---|
| నియోజకవర్గం | పోలైన ఓట్లు | ఓటింగ్ శాతం | పోలైన ఓట్లు | ఓటింగ్ శాతం | పోలైన ఓట్లు | ఓటింగ్ శాతం |
| ఆదిలాబాద్ | 12,21,563 | 74.03 | 10,63,977 | 71.42 | 10,28,755 | 74.21 |
| పెద్దపల్లి | 10,83,453 | 67.87 | 9,70,165 | 65.59 | 10,16,823 | 71.33 |
| కరీంనగర్ | 13,03,690 | 72.54 | 11,48,201 | 69.52 | 11,19,450 | 74.58 |
| నిజామాబాద్ | 12,26,133 | 71.92 | 10,63,182 | 68.44 | 10,26,658 | 68.61 |
| జహీరాబాద్ | 12,25,049 | 74.63 | 10,44,504 | 69.70 | 10,83,616 | 74.97 |
| మెదక్ | 13,72,894 | 75.09 | 11,50,331 | 71.75 | 11,80,315 | 76.81 |
| మల్కాజ్‌గిరి | 19,19,714 | 50.78 | 15,63,646 | 49.63 | 16,11,752 | 50.63 |
| సికింద్రాబాద్ | 10,39,834 | 49.04 | 9,15,263 | 46.50 | 9,97,197 | 52.66 |
| హైదరాబాద్ | 10,74,827 | 48.48 | 8,77,941 | 44.84 | 9,66,408 | 53.01 |
| చేవెళ్ల | 16,57,107 | 56.40 | 13,00,998 | 53.25 | 13,05,844 | 59.75 |
| మహబూబ్‌నగర్ | 12,18,587 | 72.43 | 9,84,767 | 65.39 | 10,05,763 | 70.89 |
| నాగర్ కర్నూలు | 12,07,469 | 69.46 | 9,89,893 | 62.33 | 10,96,580 | 74.22 |
| నల్లగొండ | 12,77,137 | 74.02 | 11,75,984 | 74.15 | 11,80,094 | 78.97 |
| భువనగిరి | 13,88,680 | 76.78 | 12,12,777 | 74.49 | 12,00,825 | 80.47 |
| వరంగల్ | 12,56,301 | 68.86 | 10,61,672 | 63.70 | 11,60,597 | 75.47 |
| మహబూబాబాద్ | 11,01,030 | 71.85 | 9,83,707 | 69.06 | 11,17,668 | 80.56 |
| ఖమ్మం | 12,41,135 | 76.09 | 11,39,848 | 75.30 | 11,78,858 | 81.84 |